క్లుప్తంగా

అన్నప్రసాద వితరణ



బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి దాతలు కేతిరెడ్డి అప్పలనాయుడు కుటుంబ సభ్యులు రూ.34 వేలు అందజేయడంతో పాటు, రూ.6 వేలు విలువైన గిన్నెను ఆలయానికి అందజేసినట్లు ఆలయ ప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 1700 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు చెప్పారు. దాత కేతిరెడ్డి అప్పలనాయుడు కుటుంబ సభ్యులను స్వామి వారి ప్రసాదం, శాలువ, మొమెంటోలతో సత్కరించినట్లు చెప్పారు.

ఘనంగా గౌర పూర్ణిమ పూజలు



స్థానిక రామాలయంలో గౌరపూర్ణిమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక రామాలయంలో గౌర పూర్ణిమను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ చైతన్య కృష్ణదాస్ ప్రభుజీ వారి ఆధ్వర్యంలో చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. అదేవిధంగా హరేకృష్ణ మంత్రాన్ని 108 సార్లు జపం చేశారు. స్వామివారికి సామూహిక హారతి సమర్పించారు. అలాగే విద్యారోహిణి విద్యార్థులను దత్తత తీసుకుని ఐక్యవిద్య ద్వారా భగవద్గీత, జీవన ప్రమాణాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యారోహిణీ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ, ఉమా పంతులు, ఐక్య విద్యా టీచర్ సోర్న పుణ్యలక్ష్మి, కరాటం భాగ్యం, కరాటం చిన్ని, ప్రభావతి, నల్లూరి విజయలక్ష్మి, కరాటం అమ్మాజీ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో వైద్య సేవలు

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం మండలం వల్లూరులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్ కె.సుధాకర్, ఆర్థోపెడిక్ సర్జన్ రాఘవేంద్ర, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్, సీహెచ్‌ఓ జాలాది విల్సన్ తదితరులు వైద్య సేవలు అందించారు.

అప్పనవీడులో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం

పెదపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ కొనియాడారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అప్పనవీడు గ్రామంలో 25 ఏళ్లుగా ఏ నాయకుడు సెంటు స్థలం ఎవరికీ ఇవ్వలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతిల్లు ఇవ్వాలనే ఆలోచన చేశారని చెప్పారు. అదేవిధంగానే అప్పనవీడులో 10 ఎకరాలు కొని పేదలకు ఇళ్ల స్థలాలు అందించడం జరిగిందని చెప్పారు. ఆన్‌లైన్ చేసుకున్న వారందరికీ ఈ ఎన్నికల అనంతరం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పేదలకు సొంతింటి కల నెరవేరిందన్నారు. ఇంత అభివృద్ధి ఏనాడైనా చూశారా అంటూ ప్రశ్నించారు. జగనన్న ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి గ్రామ సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్ధే రామసీత స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

భీమడోలు: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో అతిపురాతన ఆలయం పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వాసుబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన అభివృద్ధి కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో వాసుబాబు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను వడ్డించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి, ఆర్బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ కృషితో మత్స్య సంపద వృద్ధి

- ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లతో మారిన మత్స్యకారుల జీవన శైలి
- పర్యావరణానికి అనుకూలంగా చేప పిల్లల పెంపకానికి సహాయం





కొయ్యలగూడెం మండలం పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్), అంకాలచెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

కొయ్యలగూడెం: మత్స్య సంపద వృద్ధిలో దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. మత్స్యకార వ్యవస్థ దినదినాభివృద్ధి చెందేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టింది. మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందించడంతోపాటు ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లను నిర్మించి మత్స్య సంపద విక్రయాన్ని ప్రోత్సహించింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్) ద్వారా 60 శాతం కేంద్రం వాటాతో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా కలిపి చేప పిల్లలను మత్స్యకార సంఘాలకు ఉచితంగా అందిస్తున్నారు. మండలంలో మూడు మత్స్యకార సంఘాలు ఉండగా రాజవరం, యర్రంపేట, కొయ్యలగూడెం సంఘాలతో కలిపి సూటయాభై కుటుంబాల వారు ఉన్నారు. మత్స్యశాఖ సహకారంతో ఆయా సంఘాల వారికి ఏడు ఇరిగేషన్ చెరువులను అదేవిధంగా పంచాయతీ పరిధిలోని ఇరవై ఐదు చెరువులను మత్స్య సంపద వృద్ధికి కేటాయించడం జరిగింది. చేపపిల్లలను ఉచితంగా అందించడంతోపాటుగా ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను సబ్సిడీపై సొసైటీలకు అందజేస్తున్నారు. మత్స్య సంపదకు ఎంపిక చేసిన చెరువులలో 1.20 లక్షల చేప పిల్లలు (మూడు యూనిట్లు) ఒక్కో చెరువుకి కేటాయించడం జరుగుతుంది. వీటితో పాటుగా 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారునికి వైఎస్సార్ పెన్షన్ అందిస్తూ వారి జీవితాల్లో వెలుగు రేఖలను నింపుతున్నారు. అదేవిధంగా చేపల వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు ప్రమాదానికి గురైతే గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టి రూ.10 లక్షల వరకు ప్రమాద బీమాను కుటుంబ సభ్యులకు ఇస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మత్స్యకార సంఘాలకు ఈ విధమైన సంక్షేమ పథకాలు వర్తింపచేయలేదు అని సంఘ పెద్దలు పేర్కొంటున్నారు. సహకార సంఘాల నిర్వహణకు అందులోని సభ్యులకు శిక్షణ ఇచ్చి సొసైటీల ఎదుగుదలకు వాటి మనుగడకు సహకారం అందిస్తున్నారు. ప్రత్యేకించి ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయడంతో విక్రయాలు జోరందుకున్నాయని ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు 60 శాతం బీసీ, ఓసీలకు 40 శాతం సబ్సిడీతో రుణాలు సైతం అందజేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. చేపల పెంపకంలో సైతం పర్యావరణానికి అనుకూలంగా ఉండి మత్స్యకారులకు ఆర్థికంగా గిట్టుబాటు లభించడానికి అనువైన చేపలను పెంచడానికి ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్నారు. నాలుగు నుంచి ఆరు నెలల వ్యవధి కాలంలో మత్స్య సంపదను విక్రయించి సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదుగుదల సాధిస్తున్నారు.

పర్యావరణ సమతుల్యం పాటిస్తాం



చెరువు నీటిపై ఉన్న చెత్తను ఆహారంగా తీసుకునే బొచ్చే (కట్ల), చెరువు మధ్యలో అపరిశుభ్రతతో ఉండే ఆహారం తీసుకునే గండి (రోహల), చెరువు దిగువన ఉండే నాచును ఆహారంగా తీసుకునే గడ్డి చేప(మగాల) పెంపకాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ సమతుల్యాన్ని మత్స్యశాఖ అవలంబిస్తుంది.

– కె.మంగారావు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి, జంగారెడ్డిగూడెం

ఆర్థికంగా బలపడిన మత్స్యకార సొసైటీలు



ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లలో చేపలను, ఇతర మత్స్య సంపదను విక్రయిస్తుండడంతో విక్రయాలు బాగా పెరిగాయి. అపరిశుభ్రత వాతావరణంలో అమ్మితే ఒక్కోసారి కొనుగోళ్లు లేక నష్టపోయేవాళ్లం. ప్రభుత్వ సహకారంతో మత్స్యకార సొసైటీలు ఆర్థికంగా పుంజుకున్నాయి.

– ముంగర్ల రాము, మత్స్యకారుడు, కొయ్యలగూడెం

నేడు వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

బుట్టాయగూడెం: మండలంలోని కోటనాగవరం సచివాలయ పరిధిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు కోటనాగవరం పంచాయతీ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. ముప్పినవారిగూడెం, చెంచుగూడెం, మెట్టగూడెం, గంగవరం గ్రామాల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.80 వేల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.80 వేలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన చిత్తజల్లు ఆనాడు అనే భక్తుడు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం



లింగగూడెం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య

చింతలపూడి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో అధికారులు ప్రతిరోజు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. చెక్‌పోస్టుల వద్ద తెలంగాణ నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య లింగగూడెం, అల్లిపల్లి చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం, నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బు తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులు తమ వాహనాల్లో తీసుకు వెళితే అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని వాహన దారులకు సూచించారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనకూడదని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

నాటు సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపండి



కేఆర్‌పురం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నాటు సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో మంగళవారం రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నాటుసారా క్రయవిక్రయాలు జరగకుండా నిరోధించాలన్నారు. అదేవిధంగా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టంగా అమలు చేయాలన్నారు. అంతరరాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ మద్యం, సారాయి, మాదకద్రవ్యాలు ఏపీలోకి రాకుండా చెక్‌పోస్ట్‌ల వద్ద నిరంతరం వాహనాల తనిఖీలు జరిగేలా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అసిస్టెంట్ కమిషనర్ (విజిలెన్స్), స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(పోలవరం), తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



గూటాలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోలవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోలవరం మండలంలోని గూటాల, కొత్తపట్టిసీమ, పాత పట్టిసీమ, ఎల్ఎన్‌డీపేట గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పోలవరం డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ జి.మధుబాబు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ కోరారు. ఎన్నికల విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలక్షన్ కోడ్ అములులో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి అన్నారు.

‘టీడీపీలో బీసీలకు మనుగడ లేదు’

కొయ్యలగూడెం: టీడీపీలో బీసీ నాయకులకు మనుగడ లేదని ఆ పార్టీకి చెందిన కొయ్యలగూడెం బీసీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నియోజకవర్గంలో టీడీపీలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన వారికి ఓ న్యాయం, బడుగు బలహీన వర్గాల శ్రేణులకు మరో విధమైన న్యాయాన్ని పెద్దలు అమలు చేస్తున్నారని వాపోయారు. గతేడాది పార్టీలో నెలకొన్న విభేదాల గురించి వాస్తవాలతో సహా అధిష్టానాన్ని ప్రశ్నించినందుకు, నాయకత్వాన్ని నిలదీసినందుకు తమను పార్టీ నుంచి బహిష్కరించారని తెలిపారు. అయితే ప్రస్తుత అసెంబ్లీ టిక్కెట్ కేటాయింపు విషయంలో కాపు, కమ్మ సామాజిక వర్గాల నాయకులు పార్టీ అధినేత చంద్రబాబుని నిందించడంతోపాటు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా వారిపై ఏ చర్యలు తీసుకోలేకపోగా బుజ్జగింపు చర్యలకు దిగారన్నారు. దీనినిబట్టి టీడీపీలో బీసీలకు గుర్తింపు లేదనే విషయం తేటతెల్లమవుతుందని వాపోయారు. గెద్దా శ్రీరామచంద్రమూర్తి, స్ఫూర్తి రాజేంద్ర, కర్రి రాంబాబు, ఎ.సురేష్, ఉప్పాడ పెద్దిరెడ్డి, మాదాసు నాగరాజు ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

నేడు గాలిగోపురం నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం: అంకాలగూడెం శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో రాజ(గాలి) గోపురం నిర్మిస్తున్నట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2:46 గంటలకు (తెల్లవారితే గురువారం) సమయంలో రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల ద్రవ్య సహాయంతో 46 అడుగుల ఎత్తులో ఈ గాలిగోపురం నిర్మించనున్నారు.

పేకాట స్థావరంపై దాడి

టి.నరసాపురం: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం టి.నరసాపురంలో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,080 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

కళాకారులకు అభినందనలు



కళాకారులు ఎల్ఆర్ కృష్ణబాబు బృంద సభ్యులకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ప్రజాకళాకారులు, జానపద కళారత్న ఎల్ఆర్‌కృష్ణబాబు బృంద సభ్యులకు మంగళవారం నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. కృష్ణబాబు పర్యవేక్షణలో కోలాటం నాట్యగురువు జె.సాయిభరత్ ఆధ్వర్యంలో బండి మల్లిక, సావిత్రిబాయి పూలే మహిళా కోలాట బృందం, 111 మంది భక్తులతో తమిళనాడు రాష్ట్రం అరుణాచలంలో అరుణగిరి చేటూట 23 గంటల పాటు నృత్య ప్రదర్శన చేస్తూ ప్రదక్షిణ పూర్తి చేశారు. అరుదైన ఈ ప్రదర్శనను గుర్తిస్తూ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ (తానా), బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించి, అవార్డ్స్ ఇచ్చి కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్.కృష్ణబాబు బృందాన్ని మంగళవారం పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ పి.రాజేష్, ట్రాఫిక్ ఎస్సై రంగయ్య

జంగారెడ్డిగూడెం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. పట్టణంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని, సరైన వాహన పత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ నిబంధనలు పాటించకపోతే జరిమానాలు, చట్టపరమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

‘స్పందన’ ఫిర్యాదుపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్ బాబు

టి.నరసాపురం: స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం అధికారులు విచారణ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో టి.నరసాపురానికి చెందిన డి.విల్సన్‌బాబు సొసైటీ వాటర్ ప్లాంట్‌కు సంబంధించి ఫిర్యాదు చేశారు. టి.నరసాపురం సొసైటీ వాటర్ ప్లాంట్ మూయడానికి కారణాలు, ప్లాంట్‌లో పని చేసే సిబ్బందికి న్యాయం చేయాలని, సొసైటీలో విలువైన సామగ్రి చోరీకి బాధ్యులెవరని, నష్టాన్ని వసూలు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్ బాబు మంగళవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో విచారించామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

దుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



పుష్పాలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కనకదుర్గమ్మ, అన్నపూర్ణ, విశ్వేశ్వరస్వామి వారి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, చిన్న దంపతులు కనకదుర్గమ్మకు నూతన వస్త్రాలు సమర్పించారు. విఘ్నేశ్వరుడు, కనకదుర్గమ్మ అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి వారికి దూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లూరి రత్నాజీరావు, ఆలయ ధర్మకర్తలు భౌమరాజు సత్యనారాయణరాజు, భౌమరాజు ధనుంజయ రాజు, అల్లూరి సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుణాల్లో మిరుమిట్లు గొలిపే విద్యుత్ అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



రామయ్యపేటలో రైతు భరోసా కేంద్రం



ఇటుకలకోటలో సేవలు అందిస్తున్న హెల్త్ క్లినిక్ భవనం



రామయ్యపేటలో సచివాలయ భవనం

పోలవరం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. దళారీ వ్యవస్థ, లంచాలు లేకుండా నేరుగా ప్రజలు వారి అవసరాలను కార్యాలయాలకు వెళ్లి పూర్తి చేసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏదైనా పనిచేయించుకోవాలంటే అనేక అవస్థలు పడాల్సి వచ్చేది. జన్మభూమి కమిటీల పదిసార్లు తిప్పడం తప్ప చేసింది ఏమీ లేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రధానంగా రైతుల సమస్యలపై దృష్టి పెట్టి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పలు రకాల సర్టిఫికెట్‌లను త్వరితగతిన జారీ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యసేవలు అందించడంతో పాటు హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించేలా రూపకల్పన చేశారు. దీంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ కావడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం మండలంలో ఒక్కొక్క భవనానికి రూ. 42 లక్షలతో 14 సచివాలయాలు మంజూరయ్యాయి. రైతు భరోసా కేంద్రాలు 14 భవనాలు నిర్మాణానికి రూ. 21.80 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. హెల్త్ క్లీనిక్‌లు 10 భవనాలు నిర్మాణానికి ఒక్కొక్కటి రూ. 17.50లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి.

సచివాలయాలతో అందుబాటులోకి సేవలు

సచివాలయాల ఏర్పాటు ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకే వచ్చింది. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండలం కార్యాలయాలకు పరుగులు పెట్టాల్సిన పని లేకుండా అన్ని సేవలు సచివాలయాల ద్వారానే అందిస్తున్నారు. ప్రజలకు కావాల్సిన పలు రకాల సర్టిఫికెట్‌లు అతి సులభంగా సచివాలయాల ద్వారా అందుతున్నాయి. అంతేకాక ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల వివరాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సిబ్బందిని అడిగితే వెంటనే సమాచారం ఇస్తున్నారు. ఒక్కొక్క సచివాలయం నిర్మాణానికి రూ. 42 లక్షలు మంజూరయ్యాయి. పోలవరం మండలంలో 14 సచివాలయ భవనాలు నిర్మించాల్సి ఉండగా, 9 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ భవనాలను కూడా ప్రారంభించారు. మరో 5 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

అన్నదాతలకు అండగా ఆర్‌బీకేలు

రైతు భరోసా కేంద్రాల్లో అన్నదాతలకు విశేష సేవలందిస్తున్నారు. విత్తు నుంచి పంట విక్రయం వరకు అన్నీ సేవలు ఆర్‌బీకేల్లో లభిస్తుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 14 రైతు భరోసా కేంద్రాలు మంజూరుకాగా ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ. 21.80 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికీ 11 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ భవనాల్లో సిబ్బంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రైతులకు అవసరమైన సేవలను కూడా అందిస్తున్నారు. రైతులకు అందుబాటులో ఆర్‌బీకేల నిర్మాణంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హెల్త్‌క్లినిక్‌లతో అందుబాటులో వైద్యం

ప్రతి గ్రామంలో హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువయ్యాయి. పోలవరం మండలానికి 10 హెల్త్‌క్లినిక్‌లు మంజూరుకాగా ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ. 17.50 లక్షలు నిధులు విడుదల చేశారు. కాగా, ఇప్పటివరకు 5 హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించారు. ఈ హెల్త్ క్లినిక్ కేంద్రాల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది నిత్యం వైద్య సహాయ కార్యక్రమాలు అందిస్తున్నారు. మరో 5 భవన నిర్మాణాలు నిర్మాణ దశలో ఉన్నాయి.